## క్లుప్తంగా

### పార్టీలో పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీలో పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని.. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ సెంట్రల్ నియోజక వర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళావిభాగం జనరల్ సెక్రటరీగా నియమితులైన పేరం త్రివేణి రెడ్డి సోమవారం మల్లాది విష్ణును మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నిర్దేశించిన ప్రతి పనిని శక్తి వంచన లేకుండా పూర్తిచేస్తానని, ప్రజలకు అండగా ఉంటానని అన్నారు. అనంతరం పేరం త్రివేణి రెడ్డిని మల్లాది విష్ణు, పుష్పగుచ్ఛం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్ 11కేవీ డోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం 27వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ గెస్ట్ హౌస్, గోపాలరెడ్డి రోడ్డు, ప్రకాశం రోడ్డు, డోర్నకల్ రోడ్డు, నరసింహారావు నాయుడు వీధి, కాశేశ్వరావు రోడ్, వెంకటరత్నం వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, తాడేపల్లి వారి వీధి, పీసపాటి వారి వీధి, టొబాకో బ్యారెన్ స్ట్రీట్, డాక్టర్ ఎన్.సుబ్బారావు వీధి, దాసరి వారి వీధి, సూర్య నారాయణ వీధి, వేమూరి వారి వీధి, జడగం వారి వీధి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

### పనులు వేగవంతం



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు వీఎంసీ అధికారులు స్పందించారు. జీవీఆర్‌నగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో నిర్మిస్తున్న యూజీడీ పంపింగ్ స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురాకపోవటంతో ప్రజలు పడుతున్న అవస్థలను వివరిస్తూ 'సాక్షి' సోమవారం 'యూజీడీ పంపింగ్ స్టేషన్ ప్రారంభించరూ..' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు యూజీడీ పంపింగ్‌స్టేషన్ వద్ద సోమవారం పనులు వేగవంతం చేశారు. వర్షాలు అధికమయ్యేలోపు పంపింగ్ స్టేషన్‌ను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

### వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగ రాష్ట్ర కమిటీల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలను నియమించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పేరం త్రివేణి రెడ్డి (విజయవాడ సెంట్రల్), కార్యదర్శిగా మెన్నేపల్లి ఝాన్సీరాణి(సెంట్రల్), ఐటీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా దొడ్డా రాజశేఖరరెడ్డి (విజయవాడ వెస్ట్), బూత్ కమిటీల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కేసరి కృష్ణారెడ్డి(విజయవాడ వెస్ట్), రాష్ట్ర కార్యదర్శిగా సైకం మల్లికార్జునరెడ్డి (ఈస్ట్)నియమితులయ్యారు.

### క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వేసవి శిక్షణ శిబిరంలో విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థి వికాస వాహిని అధ్యక్షుడు విద్యార్థి వేములపల్లి కేశవరావు, ఎగ్జిక్యూటివ్ ఎం. శ్రావణి పర్యవేక్షణలో నిర్వహించిన పోటీలలో ప్రథమ బహుమతి నిహార్, ద్వితీయ బహుమతి రూపేష్, తృతీయ బహుమతి జ్యోత్స్నలు గెలుచుకున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గ్రంథాలయాధికారి కె. నాగరాజు, కేశవరావు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేవీఎస్ ఈశ్వరరావు, స్వాతి పూర్ణిమ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వానొస్తే బురదమయం

- సహనాన్ని పరీక్షిస్తున్న దావు బుచ్చయ్య కాలనీ గుణదల రోడ్డు
- చిత్తడిగా మారడంతో తిప్పలు
- ప్రమాదకరంగా ప్రయాణం



బురదగా మారిన దావు బుచ్చయ్యకాలనీ గుణదల రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ గుణదల రోడ్డు కొద్దిపాటి వర్షానికే బురదగా మారి వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తోంది. మధురానగర్, రామకృష్ణాపురం, దేవీనగర్, జీవీఆర్‌నగర్, బుడమేరు మధ్యకట్ట, విజయదుర్గా నగర్, కేఎల్‌రావు నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంత వాసులు గుణదల, ఆటోనగర్, రామవరప్పాడు వెళ్లేందుకు ఈ మార్గం దగ్గరి దారి కావటంతో ఈ రోడ్డుమీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే గుణదలలోని డాన్ బాస్కో తదితర పాఠశాలలకు విద్యార్థులు ఈ రోడ్డుమీదుగా ప్రయాణాలు చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో గత ప్రభుత్వంలోనే రోడ్డు వేయటానికి నిధులు మంజూరు చేసినప్పటికీ స్థల సేకరణలో స్థానికుల అభ్యంతరాలతో రోడ్డు పనులు జరగలేదు. దీంతో ఇక్కడ రోడ్డు కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారి ప్రమాదకరంగా మారుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల రోడ్డు బురదగా మారటంతో పాటు గుంతలు పడి వాహన చోదకుల సహనాన్ని పరీక్షించే విధంగా తయారైంది. దగ్గరి మార్గం అనే ఉద్దేశంతో ఈ మార్గం మీదుగా వచ్చిన వారు బురదలో జారి పడి గాయాలబారిన పడుతున్నారు. ఇక్కడ రోడ్డును సరిచేయాలని ఎన్ని మార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకున్న వారే కరువయ్యారని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. రోడ్డు గుంతలు పడి బురదగా ప్రమాదకరంగా ఉండటంతో పలువురు చుట్టూ తిరిగి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఇక్కడ రోడ్డును సరిచేసి రాకపోకలకు వీలుగా చేయటం వల్ల ట్రాఫిక్ సమస్యలు సైతం కొంత మేర తగ్గే అవకాశం ఉంది.



రోడ్డు పక్కన వేసిన వ్యర్థాలు

#### అదుపుతప్పితే అంతే..

ఇక్కడ మట్టి, గ్రావెల్‌రోడ్డు కావటంతో పాటు భారీ వాహనాలు రాకపోకలు సాగించటం వల్ల రోడ్డు కుంగిపోయింది. అలాగే ఈ మార్గంలో రోడ్డు పక్కనే బుడమేరు ఉంది. రోడ్డు బురదగా గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహన చోదకులు ఒక వేళ అదుపు తప్పితే నేరుగా బుడమేరులోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడేకన్నా ముందుగానే అధికారులు స్పందించి బుడమేరు వైపు రక్షణగోడను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

#### డంపింగ్ కేంద్రంగా మారిన రోడ్డు..

ఇక్కడ రోడ్డు పక్కనే భవన, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు వేస్తున్నారు. దీని వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారటంతో పాటు దుర్వాసన వెదజల్లుతున్నాయి. అలాగే బుడమేరులో తీసిన వ్యర్థాలను సైతం రోడ్డు పక్కనే వేస్తున్నారు. దీని వల్ల అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## రాష్ట్రంలో సంక్షేమ పాలన కనుమరుగు

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో సోమవారం క్లస్టర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పాలన అందించే దిశగా గత ప్రభుత్వం పనిచేసిందని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో సంక్షేమ పాలన కనుమరుగైందని చెప్పారు. ఆచరణకు యోగ్యం కాని పథకాలను ప్రకటించి, ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కూటమి పాలన మొదలై ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు కాలేదని పేర్కొన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రోగులకు ఆరోగ్యశ్రీ వంటి పథకాలు మరుగున పడ్డాయని చెప్పారు. రేషన్ వాహనాలను సైతం రద్దు చేసి ప్రభుత్వం ప్రజలకు కష్టాలను తెచ్చిపెట్టిందని ధ్వజమెత్తారు. కూటమి నేతలు కేవలం ప్రజా ధనాన్ని దోచుకునేందుకు మాత్రమే పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇప్పటికే ప్రభుత్వంపై విశ్వాసం పోయిందన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ప్రజలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ విధి విధానాలు ఎండగడుతూ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు క్లస్టర్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను గుర్తించాలని సూచించారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని కోరారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన క్లస్టర్ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య, క్లస్టర్ కమిటీ అధ్యక్షుడు ప్రభు, క్లస్టర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు



భోజనాలు వడ్డిస్తున్న అతిథులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. సోమవారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బోండా సుజాత ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరితో కలిసి అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులు, ఆలయ సిబ్బందిని అభినందించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఒంటె వాహనంపై స్వామివారి ఊరేగింపు మేళ తాళాలు, డప్పు వాయిద్యాలతో మాచవరం పురవీధుల మీదుగా సాగింది. దారి పొడవునా భక్తులు స్వామివారికి హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో దాసాంజనేయస్వామివారి దేవాలయం ధర్మకర్త మండలి మాజీ చైర్మన్ వల్లభనేని రాజేశ్వరి, నాయకులు గణేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన సమస్యలకు పరిష్కారం

వీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు):ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి సమస్య పునరావృతం కాకుండా అన్ని శాఖల విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు అధికారుల పరిశీలనపై ఎప్పటికప్పుడు ఫిర్యాదు దారునికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 20 ఫిర్యాదులు రాగా పట్టణ ప్రణాళికకు సంబంధించినవి–5, ఇంజినీరింగ్ –9 , రెవెన్యూ–1, వైద్య, ఆరోగ్యం– 4, ఫిర్యాదులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఎస్ఈలు పి. సత్యకుమారి, పి.సత్యనారాయణ, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల చోరీ జరిగిన 58వ డివిజన్‌కు చెందిన కనక దుర్గ కుటుంబానికి సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్ చేతులమీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కనక దుర్గ నివాసంలో చోరీ జరగటంతో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావును కలిసి జరిగిన నష్టాన్ని వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సంబంధిత పోలీస్ అధికారులకు సత్వరమే న్యాయం చేయాలని సూచించారు. అలాగే తన సొంత నిధులతో కనకదుర్గకు వంట గ్యాస్ పొయ్యి, 5 చీరలు, 5 దుప్పట్లు, వంట సరుకులు, కూరగాయలు ఘంటా కృష్ణమోహన్ చేతుల మీదగా అందజేశారు.

## కళలతో మానసిక వికాసం



మృదంగం అధ్యాపకుడు డాక్టర్ అమ్ముల ప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: కళలు మానసిక వికాసం కలిగిస్తాయని ఆంధ్రనాట్యాచార్యుడు పిల్లా ఉమామహేశ్వర పాత్రుడు అన్నారు. శ్రీనటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య అధ్యాపకులకు, నృత్యకళాకారులకు బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ప్రధానంగా లైవ్ కార్యక్రమం నిర్వహించే సందర్భంలో తాళం, జతులు విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న విషయం మీద అవగాహన కల్పించారు. భారతీయ నృత్య సంప్రదాయంలో లైవ్ కార్యక్రమం ప్రధానమైందని రికార్డింగ్ ద్వారా నృత్యం చేయడం కన్నా లైవ్ ద్వారా చేయడం వల్ల నృత్యంలో జీవకళ కనిపిస్తుందన్నారు. మృదంగ అధ్యాపకుడు డాక్టర్ అమ్ముల ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో సాంస్కృతిక కళలకు పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. ఆంధ్రనాట్యాచార్యుడు రాయన శ్రీనివాసరావు, బాలోత్సవ్ ప్రతినిధి తులసీరావు, గుండు నారాయణరావు పాల్గొన్నారు. నిర్వాహకులు మృదంగం అధ్యాపకుడు అమ్ముల ప్రసాద్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

## వృత్తిపరమైన వ్యాధులను అధిగమించాలి



ఇబ్రహీంపట్నం: ఉద్యోగులకు వృత్తిపరంగా సంభవించే వ్యాధులను అధిగమించాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ శివ రామాంజనేయులు తెలిపారు. ఎన్టీటీపీఎస్‌లో ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం, సంపూర్ణ పోషకాహారం తీసుకోవడం, ఒత్తిడిని దూరం చేయడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. ఇటువంటి వైద్య శిబిరాల ద్వారా మనకు తెలియని వ్యాధులు బయటపడితే పూర్తిస్థాయి వైద్యం తీసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. 550 మంది ఉద్యోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## దాతల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ అసోసియేషన్ అందిస్తున్న సహాయాన్ని విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోలని ఆంధ్రా మోటారు మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) అధ్యక్షుడు గారపాటి సతీష్ బాబు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ (బీఎస్ఆర్‌కే) హైస్కూల్‌లో 9వ తరగతి నుంచి 10వ తరగతిలోకి వస్తున్న విద్యార్థులకు వేసవిలో నిర్వహించిన మ్యాథ్స్‌లో శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం పాఠశాల ఆవరణలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ పాఠశాలను 2014లో తమ అసోసియేషన్ దత్తత తీసుకున్నప్పటి నుంచి అవసరమైన సహాయ సహకారాలతో పాటుగా విద్యార్థులకు అండగా ఉంటున్నామని చెప్పారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులు ఎస్‌కే. అయేషా, కె.లలిత, ఎస్.ప్రదీప్తిలతోపాటుగా మ్యాథ్స్ సమ్మర్ క్యాంప్ నిర్వహించిన ఉపాధ్యాయుడు లెనిన్ బాబుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి సత్కరించారు. 'అమ్మ' ఉపాధ్యక్షుడు దోనేపూడి దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శి కొమ్మినేని దుర్గామల్లిఖార్జునరావు, 'అమ్మ' మాజీ అధ్యక్షులు బొబ్బా నారాయణ, యార్లగడ్డ సుబ్బారావు, సభ్యులు యర్రంశెట్టి శివరామకృష్ణ, కోయ వెంకటేశ్వరరావు, వై.శివరామకృష్ణ, బీఎస్ఆర్‌కే హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ పార్వతీశ్వర శర్మ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భాషా పండితులు పరిశోధన ద్వారా తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రముఖ సాహితీవేత్త, ఔచిత్యమ్ పత్రిక ప్రధాన సంపాదకుడు డాక్టర్ రాంభట్ల పార్వతీశ్వరశర్మ అన్నారు. కేబీఎన్ కళాశాల రీసెర్చ్ సెల్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో భాషోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం (ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం) జరిగింది. ఈ సందర్భంగా పార్వతీశర్మ శర్మ మాట్లాడుతూ పరిశోధన పత్ర రచనకు విస్తృతంగా అధ్యయనం చేయాలని తెలిపారు. పరిశోధనాంశం ఎంపిక, పరిశోధన విధానాలు, పద్ధతులు, సమాచార సేకరణ, పత్ర రచన తదితర అంశాలు మొదలు పూర్తి పరిశోధన పత్ర రచన చేయటం వరకు ప్రతి అంశాన్నీ ఉదాహరణ పూర్వకంగా వివరించారు. అధునాతన సాంకేతిక విధానాలను భాషా పరిశోధనకు, పరిశోధన పత్ర రచనకు అన్వయించే విధానాన్ని వివరించారు. ప్రామాణిక గ్రంథాల ఆధారంగా ఉపయుక్త గ్రంథ సూచి (బిబ్లియోగ్రఫీ) రచన వరకు అనుసరించాల్సిన విధానాలను ఉదాహరణలతో వివరించారు. పరిశోధన నాణ్యతను మెరుగుపరచడంలో చాట్ జీపీటీ వంటి అధునాతన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ ఎలా ఉపయోగపడతాయో స్పష్టంగా వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.రామకృష్ణ, పీఎల్ రమేష్, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హెల్త్ రికార్డు నమోదు



వైద్య విభాగం ఉద్యోగుల హెల్త్ రికార్డు ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుభాషిణి

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధి పరిపాలన విభాగంలో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ నమోదు, అభా ఐడీల నిర్వహణ జరిగింది. విజయవాడ జీజీహెచ్‌లో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుహాసిని ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఈ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఉద్యోగుల నమోదు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మినిస్టీరియల్ ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు బీవీ రవికుమార్, కార్యదర్శి డి. నాంచారయ్య, దుర్గా ప్రసాద్, కె. శ్రీనివాస్, కె.వాసు, ఎస్. ఆనంద్, సాయి తేజ, జి.శైలజ, వినయ్ కుమార్, అర్జున్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ ప్రారంభం



ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శరత్‌కుమార్, ఇందుమతి

ఇబ్రహీంపట్నం: మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ ప్రత్యేక కార్యక్రమం ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభమైంది. జిల్లా వ్యాక్సినేషన్ అధికారి డాక్టర్ శరత్‌కుమార్, డెప్యూటీ డీఎంహెచ్ఓ హిందుమతి వ్యాక్సినేషన్ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల్లో గవద బిల్లల వ్యాధి నివారణ కోసం మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించాలని సూచించారు. వ్యాక్సిన్ అందకుండా ఏ ఒక్క చిన్నారి ఉండకూడదని వైద్య సిబ్బందిని ఆదేశించారు. తల్లిదండ్రులు ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉపయోగించుకుని చిన్నారులకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. మొదటి విడతగా ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్ అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్లు పర్వీన్, డాక్టర్ సుమంత్, సీహెచ్‌ఓ నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఈవో దుర్గారావు ద్వారకాతిరుమలకు బదిలీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఏఈవో ఎం. దుర్గారావు ద్వారకాతిరుమల దేవస్థానానికి డెప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ దేవదాయ శాఖ అడిషినల్ కమిషనర్ టి.చంద్రకుమార్ ఆదేశాలు జారీ చేశారు. దుర్గగుడి నుంచి దుర్గారావు ద్వారకాతిరుమలకు బదిలీ కాగా, అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి వార్ల దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న బి.వెంకటరెడ్డిని దుర్గగుడికి డెప్యూటేషన్‌పై బదిలీ చేశారు.

## కాలువలో పడిపోయిన గ్రేడింగ్ గేటు



పాయకాపురం పెట్రోల్ బంక్ వద్ద కాలువలో పడిపోయిన గేటు

పాయకాపురం(విజయవాడరూరల్): అవుట్ పాల్ డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలను అదుపు చేసేందుకు ఏర్పాటు చేసిన గ్రేడింగ్ గేట్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. ఇంజినీరింగ్ సిబ్బంది వాటిని పట్టించుకోవడం లేదు. పాయకాపురం పెట్రోల్ బంక్ వద్ద కాల్వలో ఐరన్ గ్రేడింగ్ గేటు పడిపోయింది. దీంతో అక్కడ ప్రమాదకర పరిస్థితి కనిపిస్తోంది. గ్రేడింగ్ గేట్లు కాల్వలపై సక్రమంగా ఉండే విధంగా ఇంజినీరింగ్ సిబ్బంది చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## లారీ ఢీకొని ముగ్గురికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):లారీ ఢీకొని వ్యక్తితో పాటు ఇద్దరు పిల్లలకు గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పీ. నైనవరం గ్రామంలో ఇంజరపు బ్రహ్మానందం కుటుంబం నివాసం ఉంటుంది. ఇత్తడి బిందెలు తయారు చేసే కంపెనీలో పని చేస్తుంటాడు. సోమవారం మధ్యాహ్నం బ్రహ్మానందం తన తోడల్లుడు ఇద్దరు పిల్లలను వాంబే కాలనీలో దింపేందుకు బైక్‌పై బయలుదేరాడు. వైవీ.రావు రింగ్ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బ్రహ్మానందంతో పాటు ఇద్దరు పిల్లలకు గాయాలు కాగా స్థానికులు ఆటోలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.